# బీఆర్ఎస్‌లో పోటెత్తిన చేరికలు

- వివిధ పార్టీలు.. సంఘాల నాయకుల చేరిక
- కండువా కప్పి ఆహ్వానించిన బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి కొప్పుల ఈశ్వర్


కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి ఈశ్వర్

ధర్మపురి/ధర్మపురి రూరల్, నవంబర్ 14: ధర్మపురి నియోజకవర్గంలో కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి నాయకులు క్యూ కడుతున్నారు. రోజురోజుకూ భారీ సంఖ్యలో ఆ పార్టీని వీడుతున్నారు. మంగళవారం మండలంలోని తుమ్మెనాల గ్రామం నుంచి దాదాపు 30 మంది కాంగ్రెస్ పార్టీకి చెందిన యువకులు ధర్మపురి బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి కొప్పుల ఈశ్వర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఈశ్వర్ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులతో పాటు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, మ్యానిఫెస్టోను ప్రజలకు కార్యకర్తలు వివరించాలన్నారు. తెలంగాణ వచ్చాక జరిగిన అభివృద్ధి, కాంగ్రెస్ పాలనలో పడ్డ కష్టాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ఏడు దశాబ్దాలుగా పాలించిన కాంగ్రెస్ రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిందని విమర్శించారు. సరిపడా కరెంట్ లేక పడ్డ గోసను ప్రజలకు గుర్తు చేయాలన్నారు. స్వరాష్ట్రం ఏర్పడ్డాక సీఎం కేసీఆర్ ప్రతి గ్రామంపై దృష్టి సారించి వందల కోట్లు కేటాయించి అభివృద్ధి చేశారన్నారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తామన్నారు. ఇక్కడ నాయకులు తదితరులున్నారు.

### లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన నాయకులు

గొల్లపల్లి, నవంబర్14; మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన ఇద్దరు వార్డు సభ్యులు, ముదిరాజ్ సంఘం నాయకులు యువకులు మంగళవారం మంత్రి సమక్షంలో పెగడపల్లిలో కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. లక్ష్మీపూర్ 1వ వార్డు సభ్యుడు బాలయ్య, 4వ వార్డు సభ్యుడు మాట్నీ తిరుపతి, గొల్లపల్లి మండల బీజేవైఎం ఇంచార్జీ ఆకుల కనకరాజు, ముదిరాజ్ సంఘం సభ్యులు 100 మంది తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సక్షేమ పథకాలు, గ్రామాల అభివృద్ధిని కాంక్షిస్తూ బీఆర్ఎస్ పార్టీలో చేరినట్లు వారు పేర్కొన్నారు.

### గుల్లకోట, గొడిసెలపేట గ్రామాల నాయకులు

వెల్గటూర్, నవంబర్ 14: ఎండపల్లి మండలంలోని గుల్లకోట, గొడిసెలపేట గ్రామాలకు చెందిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నుంచి పలువురు యువకులు బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి కొప్పుల ఈశ్వర్ చేపడుతున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరారు. కాగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గుల్లకోట నుంచి 40 మంది, గొడిసెలపేట నుంచి 30 మంది యువకులు చేరారు. కార్యక్రమంలో ముస్కు దేవేందర్‌రెడ్డి, తిరుపతి, మల్లేశ్, రవి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.


గొల్లపల్లి: కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి ఈశ్వర్


వెల్గటూర్: మంత్రి కొప్పుల సమక్షంలో పార్టీలో చేరిన గొడిసెలపేటకు చెందిన యువకులు

# బీఆర్ఎస్ ఇంటింటా ప్రచారం


ధర్మపురి: పట్టణంలో మ్యానిఫెస్టో కరపత్రం అందించి ఓటు అభ్యర్థిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ధర్మపురి, నవంబర్ 14: ధర్మపురి మరింత అభివృద్ధి చెందాలంటే బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌కే ఓటు వేయాలని ఆ పార్టీ శ్రేణులు కోరుతున్నారు. ఈ మేరకు మంగళవారం పట్టణంలో ప్రచారం నిర్వహించారు. ధర్మపురి ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్నప్పటికీ గతంలో అభివృద్ధికి మాత్రం నోచుకోలేదన్నారు. సీఎం కేసీఆర్ దీక్ష, పట్టుదలతో ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన తర్వాత కొప్పుల ఈశ్వర్ కృషితో ధర్మపురికి ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధిలో ఆదర్శంగా నిలిపారన్నారు. ప్రచారంలో జడ్పీటీసీ అరుణ, ఎంపీపీ చిట్టిబాబు, మున్సిపల్ చైర్ పర్సన్ సంగి సత్తెమ్మ, ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేశ్‌కుమార్, వైస్ చైర్మన్ అక్కనపల్లి సునీల్‌కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఇందారపు రామన్న, కౌన్సిలర్లు వేణు, అశోక్, యూనస్, అనంతుల విజయలక్ష్మి-లక్ష్మణ్, వొద్నాల ఉమాలక్ష్మి-మల్లేశం, తరాల కార్తీక్, కో ఆప్షన్ సభ్యులు అలీం, వసంత్, నాయకులు సంగి శేఖర్, ఇనుగంటి వెంకటేశ్వరరావు, భారతపు మంజుల-గుండయ్య, గడ్డం బాలరాజు తదితరులు పాల్గొన్నారు..

### ముక్కట్రావుపేట, గుల్లకోటలో

వెల్గటూర్, నవంబర్ 10: ముక్కట్రావుపేట, ఎండపల్లి మండలంలోని గుల్లకోటలో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన పథకాలు, మ్యానిఫెస్టోను వివరిస్తూ ఓటు అభ్యర్థించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు కూస మధుకర్, రమణయ్య, సర్పంచ్ ఆగండ్ల తిరుపతి, నాయకులు కూస మహేశ్, కొప్పుల విజయ్, కొప్పుల ప్రసాద్, రాజమౌళి, నరేందర్, వినయ్, సందీప్, పీటర్, ఉదయ్, భీమయ్య, పవన్ తదితరులు ఉన్నారు.

### తిర్మలాపూర్‌లో..

గొల్లపల్లి, నవంబర్ 14: తిర్మలాపూర్ పీడీ గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు గడపగడపకూ ప్రచారం చేశారు. కారు గుర్తుకు ఓటు వేసి ఈశ్వర్‌ను గెలిపించాలని ఓటర్లను విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ రమేశ్, ఎంపీటీసీ లావణ్య జలపతి, మండల కో ఆప్షన్ సభ్యుడు అలీ, ప్యాక్స్ చైర్మన్ మాధవరావు, నాయకులు లింగా రెడ్డి, రాంచందర్ రెడ్డి, కిషన్, జలంధర్ తదితరులు పాల్గొన్నారు.


గొల్లపల్లి : తిర్మలాపూర్‌లో వృద్ధురాలిని కారు గుర్తుకు ఓటెయ్యాలని కోరుతున్న నాయకులు


వెల్గటూర్: ముక్కట్రావుపేటలో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## కేంద్ర సాయుధ బలగాల ఫ్లాగ్ మార్చ్


ఫ్లాగ్ మార్చ్‌ను ప్రారంభిస్తున్న పోలీస్ అధికారులు

ధర్మపురి రూరల్, నవంబర్ 14: ధర్మపురిలో కేంద్ర సాయుధ బలగాలు 200 మంది సిబ్బంది మంగళవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఆర్ అడిషనల్ ఎస్పీ భీమ్‌రావ్ జెండా ఊపి ఫ్లాగ్ మార్చ్‌ను ప్రారంభించారు.. పట్టణంలోని ప్రధాన కూడళ్ల మీదు గా కొనసాగింది. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా ప్రజలు సహకరించాలని ఈ సందర్భంగా ఎస్పీ కోరారు. ఎన్నికల నిర్వహణకు బీఎస్ఎఫ్ కేంద్ర సాయుధ బలగాలు చేరుకున్నాయని, ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పటిష్ట చర్యలు తీసుకుంటామని, ప్రజలు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఏమైనా సమస్యలుంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ రవీంద్రకుమార్, బీఎస్ఎఫ్ డీఎస్పీలు సురేశ్, డిపాన్‌కర్, ధర్మపురి సీఐ రమణమూర్తి, ఎస్ఐలు దత్తాద్రి, నరేశ్, సందీప్, శ్వేత, సిబ్బంది ఉన్నారు.

## నేడు ప్రజా ఆశీర్వాద యాత్ర..

ధర్మారం, నవంబర్ 14: ధర్మారం మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం నిర్వహించే ప్రజా ఆశీర్వాద యాత్రకు ధర్మపురి బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి కొప్పుల ఈశ్వర్ హాజరవుతారని నందిమేడారం ప్యాక్స్ చైర్మన్ ముత్యాల బలరాంరెడ్డి, మండలాధ్యక్షుడు రాచూరి శ్రీధర్ తెలిపారు. ఉదయం 11 గంటలకు కమ్మర్‌ఖాన్‌పేట గ్రామంలో కార్యక్రమం ప్రారంభమవుతుందని, కొప్పుల ఈశ్వర్ హాజరై ఇంటింటా ఎన్నికల ప్రచారం చేస్తారని వివరించారు. ఆ తర్వాత ధర్మారంలో మంత్రి సమక్షంలో చేరికలు ఉంటాయని వారు వివరించారు. అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు లంబాడీ తండా (బి), 3 గంటలకు కొత్తూరులో జరిగే ప్రజా ఆశీర్వాద యాత్రలో మంత్రి ఈశ్వర్ పాల్గొంటారని వివరించారు.

## షీ టీం సేవలపై అవగాహన

గొల్లపల్లి, నవంబర్ 14: చిల్వాకోడూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని విద్యార్థినులకు షీ టీం, ఏహెచ్‌టీయూ టీమ్ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, జిల్లాలో మహిళల హక్కులు, రక్షణకు షీ టీం ప్రత్యేకంగా పని చేస్తుందన్నారు. మహిళలు, యువతులు, విద్యార్థినులు ఎలాంటి సమస్య ఉన్నా నిర్భయంగా షీ టీం నంబర్ 8712670783కు సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో మహిళా కానిస్టేబుల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ధర్మపురిలో ప్రారంభమైన కార్తీక సందడి


గోదావరి నదికి హారతి ఇస్తున్న భక్తులు, దేవస్థాన సిబ్బంది

ధర్మపురి, నవంబర్ 14: ధర్మపురిలో కార్తీక మాసం సందడి ప్రారంభమైంది. మొదటి రోజైన మంగళవారం భక్తులు గోదావరి నదిలో స్నానాలచరించి కార్తీక దీపాలను వదిలారు. కార్తీక మాసం సందర్భంగా లక్ష్మీనర్సింహ స్వామివారి ఆలయం నుంచి సాయంత్రం దేవస్థాన సిబ్బంది మేళ తాళాలతో గోదావరి నది వద్దకు చేరుకున్నారు. గోదావరి ఒడ్డున నదీమా తల్లికి పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గోదావరికి హారతినిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గోదావరిలో కార్తీక దీపాలను వదిలి భక్తి ప్రపత్తులను చాటుకున్నారు. కార్యక్రమంలో దేవస్థానం ఈవో సంకటాల శ్రీనివాస్, రెనొవేషన్ కమిటీ సభ్యులు ఇందారపు రామన్న, వేద పండితులు బొజ్జ రమేశ్‌శర్మ, ముత్యాల శర్మ, పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, ఉప ప్రధానార్చకుడు నేరెళ్ల శ్రీనివాసాచారి, ముఖ్య అర్చకుడు నంబి శ్రీనివాసాచార్యులు, అభిషేకం పురోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, సంపత్‌కుమార్, రాజగోపాల్, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.